# "మరతుమన్న మరుపురారు..."

*ప్రతియోగి పుంగవునికీ భూతకాలం ఉన్నట్లే*
*ప్రతిపాపికీ వొక భవిష్యత్తుకూడా వుంటుంది* **- ఆస్కార్ వైల్డు**

సాహిత్య ప్రియులు నొక ఉత్కృష్ట గ్రంథాన్ని తెరిచి జాగ్రత్తగా పరిశీలించి వొక గ్రంథకర్తని తెలుసుకుందామని చదవడం ప్రారంభిస్తారు. తీరా చివ్వరదాకా చదివితే, వారికి కనిపించేది సాధారణ మానవమాత్రుడే. సాధారణ మానవుడు జరిగిపోయిన విషాదకరమైన అనుభవాలను మరచిపోయి సహజమైన నిర్దుష్ట వ్యక్తిత్వాన్ని చంపుకుని సంఘం యేర్పరచిన నైతిక ఆదర్శంలో తనవర్తమానాన్ని యిముడ్చుకుంటాడు. ఎవరైనా జరిగిపోయిన సంగతులను జ్ఞప్తికి తెస్తే మరిచిపోయినట్లు నటిస్తాడు. ఈ జరిగిపోయిన విషయాలతోనే కళానుభవజ్ఞుడైన గ్రంథకర్త వొక ఉత్కృష్ట గ్రంథం తయారుచేస్తాడు. సాధారణ మానవుని శరీరంలోంచి బైటికి చిందిన ప్రతి రక్తపు చుక్కను. జీవిత రహస్యం తెలుసుకున్న వ్యక్తి వెయ్యికన్నీటి బిందువులుగా మార్చగలడు. తమ మనసారా ఖేదించి మరిచిపోయి కప్పిపుచ్చవలసిన సంగతులు లేవని తెలుసుకోడంలోనే జీవిత రహస్యం దాగివుంది. కొండమీదికి వెళ్ళిం తర్వాత తను యెక్కివొచ్చిన మెట్లన్ని మరిచిపోయినప్పుడు మళ్ళా క్రిందికి దిగడానికి మార్గంలేక మృత్యువుని ధిక్కరించి క్రిందికి దూకుతాడు. అందుకు ధైర్యం లేకపోతే, "మీ రెవ్వరూ యిక్కడికి రాలేరోయ్" అని చప్పట్లు కొడతాడు. మొత్తంమీద రెండువిధాలా ప్రపంచానికి దూరుడవుతాడు. అల్లా దూరుడు కాకుండా ఉన్న ప్రతి వ్యక్తిలోనూ వొక గ్రంథకర్త జన్మించి తీరతాడు. వీరికి విషయాలూ వ్యక్తులూ మరిచి పోదామన్నా మరుపురావు. కాని వీరిజీవిత గ్రంథంలోని మొదటి అధ్యాయాలను వ్రాసుకుని పదిమందికీ తెలిసేటట్లు ప్రకటించలేరు. కొందరు సాహసించి వారు నటించిన నాటకాన్ని వారికైనా తెలిసేటట్లు ఊహలో రచించగలరు. ఇల్లాంటి కొందరిలో వొకవ్యక్తి తన జీవిత గ్రంథాన్ని తిరగవేశాడు.

"**అధ్యాయం మొదటిది:** సాయంకాలం ఆ సందులోంచి వెడుతుంటే, పూరింటి ముందు మట్టి అరుగుమీద చిన్నపిల్లాడితో ఆడుకుంటూన్న పన్నెండు సంవత్సరాల పిల్లను చూశాను. దుమ్ములో మాసిపోయి చిరిగిన పరికిణీ కుట్టుకుంది. పైభాగం అంతా చిరిగిపోయిన చొక్కాలోంచి కనిపిస్తూనేవుంది. జుట్టంతా అట్టకట్టి చచ్చిన నల్లతాచు పిల్లలాగా అల్లుకుపోయింది. మధ్యగా నాసిక అడ్డం తగిలిందికాని లేకపోతే రెండు నేత్రాలూ వొకేకన్నులాగా కనిపించేంతటి విశాలంగా ఉన్నాయి. మురికితో డాగులు పడ్డ ఆముఖంలోని తెల్లటికళ్ళు ఆ తెలుపు మధ్యలో నలుదిక్కులా నాట్యమాడే నల్లటి పాపలూ, బొగ్గుల బుట్టలో పాలచెంబు దాచిన ఉపమానాన్ని స్ఫురింపజేసినవి. క్రిందికి వాలిన

కళ్ళమీది కనురెప్పల నీడ బుగ్గలపైన పొడుగాటి గీతలు గీసింది. ఆ గీతల మధ్యనే రెండు గులాబీ మొగ్గలు వికసిస్తున్నాయి. నే నల్లా వెళ్ళన నాలుగైదు రోజులు అక్కడే అల్లాగే ఆడుకునేది. ఆ రోజున నేను కొంచెం నవ్వి చూశాను. దానికి జవాబుగా నా కడుపు నిండేలాగా ఓపిగలేని లేత పెదవులను కదల్చింది. అట్లాగే పదిహేను దినాలు..."

**"అధ్యాయం రెండు:** నన్ను పక్కసందులోంచి తిరిగి లోపలికి రమ్మంది. గదిలో నవారు మంచంమీద కూర్చున్నాను; గోడని అద్దం, అద్దం ముందు బల్ల, బల్లమీద రీడ్లు యెగాదిగావున్న పాత హార్మోనిపెట్టి ఉన్నాయి. గోడలమీద తగిల్చివున్న పటాలు రెండయినా, మేకులు, మేకుకన్నాలూ చాలా ఉన్నాయి. కూర్చుని, మొదటి పదినిమిషాలూ మాట్లాడలేక వీటిని పరకాయించి చూడగలిగాను.

"ఏమండి మీరు మాపిల్లని పెండ్లి చేసుకుంటారని పుకారు బయలుదేరింది. మీరు యిష్టపడితే, మీ వాళ్ళు యేమీ అనరుట. నిజమేనాండి!"

నా దగ్గరనుంచి సమాధానం లేదు. మళ్ళా ఆరంభించి "మా పిల్ల రోజు మిమ్మల్ని గురించే చెప్పుతుంది. నిద్దట్లోకూడా అదే పలవరింత పిచ్చిముండా! ఆయన మనకులం వాళ్ళని యెక్కడ చేసుకుంటారే అంటే, విందండి. మీకు అదంటే, చాలా యిష్టమనీ, మీరు పెండ్లి చేసుకోకపోతే ఆఖరికి మీ యింట్లో, వూరికే కూలిపనేనా చేసి వుంటాననీ, యివే కబుర్లండి అస్తమాను... ఏమండి, నిజంగా చేసుకుంటారు....?"

"అబ్బే పెండ్లి చేసుకుంటానని యెవరన్నారు? మావాళ్ళ కీమాట తెలిస్తే అమ్మో! యింకేమన్నా వుందీ! అది కాకపోయినా, నా కప్పుడే పెండ్లేమిటి యెవరేనా నవ్వుతారు" అన్నాను.

"మరవుతే, ఎందుకు రోజు మీరు అల్లా మాపిల్లకేసి చూచి నవ్వడం?"

"అబ్బే ఊరికినే. దోవలో పోతుంటే మనం అందర్నీ చూడమా? ఏదో మీ పిల్ల నా కండ్లకు బాగుంది?"

"అందుకనే పెండ్లి చేసుకోరాదు?"

"అబ్బే - బాగంటే, చూడడానికి బాగుందన్నమాట. పైగా మేం బ్రాహ్మలం, మానాన్న పెద్ద ఉద్యోగి, నాకేమీ యీ విషయాలలో స్వతంత్రం కూడా లేదు. మా వాళ్ళలో నా కిస్తామన్న పిల్లలాగా వుంటుంది మీ అమ్మాయి. ఇప్పు డా పిల్లకి పెళ్ళయిపోయింది. ఆ పిల్ల జ్ఞాపకం రావడంవల్ల అల్లా చూస్తాను అంతేకాని, యీ సంగతులు మళ్ళా యెవళ్ళతోనేనా అనేవుగనక."

మేం మాట్లాడేటప్పుడు, పుష్ప ఆ గదిలో లేదు.

* * * *

**"అధ్యాయం మూడు:** చెరువు నుంచి నీళ్ళబిందె భుజాన్ని పెట్టుకుని, నా యెదురుగా వొస్తోంది. పరికిణీ, చొక్కా, పైన ఓణీ పూర్వంలా కాకుండా, శుభ్రంగా ఉన్నాయి. శరీరంలోకి రావలసిన స్థూలత, పొడుగు వొచ్చాయి. అప్పుడు నాలోకి చూసిన చూపు నన్ను, అప్పుడే జన్మించిన పసిపాపలా మార్చింది. బిందెలోని నీళ్ళు వొలికి శరీరం మీదపడి, బట్టలను తడిపినాయి. ఓణీక్రిందికి జారుతుంది. దాన్ని సర్దేందుకు, బిందెమీద నుంచి, చేతిని కిందికి లాగుతుంది. బిందె కిందకు పడిపోయింది.

నేను యెదురుగా నిలబడ్డాను. సిగ్గుతో తలవొంచుకుని, పమిట కూడా సర్దుకోదు. తడిసిపోయిన తెల్ల రెవికలోంచి చూశాను – నల్లపూసల తాడు చిక్కుపడిపోయింది. రెప్పలు పైకెత్తి, నన్ను భయంతో చూసి, రెప్పలు దించి, బిందె తీసుకుని, తనంతటతానే "నిన్న రాలేదే?" అని, నలువైపులా చూసింది. అప్పుడే నల్లటి చీకటి వ్యాపిస్తోంది. చెరువుగట్టున, వొకరిద్దరు తప్ప, యెవ్వరూలేరు. నేను, వొణికిపోతున్న అరచేతిని, ఆమె నల్లటి భుజంమీద ఆనించాను. మళ్ళా నేత్రాలు నాచేతివైపు త్రిప్పి, రహస్యంగా, నిశ్శబ్దంగా నవ్వింది. పూర్తిగా వికసించిన గులాబీ పుష్పం, ఎందుకో ముడుచుకుపోయి, మళ్ళా చిన్న మొగ్గకింద మారిపోయినట్లుగా, నా చేతికింద తనచేతిని దాచింది."

* * * *

"**అధ్యాయం నాలుగు:** ఆ సందులోంచే, ఆ యింట్లోకే వెళ్ళి ఆ గదిలోనే కూర్చున్నాను. పుష్ప అక్కడలేదు. దాని తల్లి యిదివరలాగానే గదిలోకి వొచ్చి తలుపు దగ్గర నిలబడి మాట్లాడింది.

"మళ్ళా యిన్నిదినాలకు మామీద దయ కలిగిందా?"

"అల్లాగంటావేం, రోజూ నేను మీ యింటి ముందునుంచే వెడుతున్నాగా?"

ఈసారి ధైర్యంగా మాట్లాడకలుగుతున్నా.

"అవుతే, పెండ్లిమాట నిశ్చయం చేశారా? పుష్ప చంపుకుతింటోంది అడగమని. దానికి తగని సిగ్గు. అది, అసలు నాకు పుట్టవలసిందే కాదు. రోజూ రాత్రిపూట రాగాలూ, అన్నం తినదు, యింట్లో పనీ చెయ్యదు..."

"పెండ్లేమిటి యెవరేనా నవ్వుతారు. నేనింకా బోలెడు చదువుకోవాలి. పైగా మీకులం మాట అల్లా వుంచి, మీ వ్యవహారాలూ, మీరు వుండే విధానం మా వాళ్ళకి తెలిస్తే...."

అని, యింకా బోలెడు చెప్పబోతున్నా.

"చాల్లెండి. అట్లాంటి మాట్లనకండి. మా కులం తక్కువదే; భగవంతుడు మా కిల్లారాసిపెట్టాడు. అంత మాత్రం చేత, మేం బజారు ముండలమనీ, నీతి, జాతీ లేనివాళ్ళమనీ అనడం మీకు తగదు. మీకు కోపం వస్తుందని భయపడుతున్నా కాని, మీ కులం వాళ్ళే యీ మధ్య అన్ని విధాలా చెడిపోతున్నారు. కాని మీ మగవారు, పాపం అమాయకులు. అన్నీ కప్పేసుకుని, యేదో చాటుచాటుగా కాలం వెళ్ళబుచ్చుకున్నారు. ఎటొచ్చీ, మా కులం వల్లా, బీదతనం వల్లా మేం అందరి నోళ్ళల్లోనూ పడుతున్నాము. మీరేమో గోప్యంగా ఉన్నారు. అంతే భేదం. నిజంగా చూస్తే మా పిల్లలాంటి పిల్ల మీ కుటుంబాలలో వుండనే వుండదు. నేనొకటడుగుతా చెప్పండి. మీలో ఆడపిల్లలు "అమ్మా, నే నా అబ్బాయిని ప్రేమించానే, మాకు పెండ్లి చెయ్యండే" అని అడుగుతారు? అందాకా యెందుకు, పెండ్లయిం తర్వాతనే, మొగుడితో మనసిచ్చి మాట్లాడతారు.' అత్తలమీద కోడళ్ళు, యిద్దరి మధ్యనా మొగుళ్ళు పడి, గుద్దులాడడంతప్ప మీలో యేముందో చెప్పండి. శరీరాలని వొకళ్ళకి మనస్సుని వేరొకళ్ళకి వప్పజెప్పి, నిక్షేపంలాంటి సంసారాలని వల్లకాటి క్రింద మార్చేవారు మీలో ఎందరు లేరు?...."

ఈ ఉపన్యాసం నాకు చాలా కష్టం కలిగించింది. నీచకులంలోని పిల్లని ప్రేమించి, దానికోసం సందుల్లో దూరి, యిల్లా వెధవ తాత్కాలిక సౌఖ్యంకోసం, నా కుటుంబాన్ని, నా కులాన్ని దూషించినా విని పూరుకోడం అమానుషమైన సంగతని తెలుసుకుని, ఆఖరికి బాధిస్తోన్న విషయం బైటికి వెళ్ళగక్కాను.

"మీ అమ్మాయికీ, యీ సందులో గోవిందానికీ, సహవాసంట, నిజమేనా? అతను మీ పిల్లకి సంగీతం చెబుతాడుట. నే పెండ్లి చేసుకుంటానన్న ఆశవల్ల అతన్ని మీ యింటికి యీ మధ్య రాకుండా చేస్తున్నారటగా...".

"ఎవతె, యిది మీతో అన్నది...." అని లేవబోయింది. ఇంతలో యెట్లా వొచ్చిందో, పుష్ప గది లోపల కొచ్చి, వాళ్ళమ్మని బైటికి నెట్టి, తలుపులోపల గొళ్ళెం తగిలించి, చురచురా వొచ్చి, నా నడుంమీద వాలిపోయింది. తనచేతులను నా మెడచుట్టూ వేసి కిందికి వొంచుతూ, యేడవడం మొదలెట్టింది. మధ్యలో యేడ్పు ఆపుజేసుకుని, నాకేసి ప్రణయ విషాదంతో చూసి, ఆ కంఠంలోనించి వొచ్చే వోపికలేని యేడ్పు, యేడ్పు మధ్యలో తడబడే మృదువైన స్వరాలు, కండ్లలోంచి కాలవలగా కారే ఆ వెచ్చని కన్నీరూ, నా మనస్సును లోపలనుంచి యివతలకి లాగి, మూగవానిగా మార్చేశాయి. ఆయాసం వల్ల వొచ్చే వేడి నిట్టూర్పు, వక్షస్థలం లోపలి భాగం నుండి మెల్లగా ప్రసరించే శరీరపు వింత సువాసనా, నన్ను బాహ్య ప్రపంచాన్నుంచి విముక్తుణ్ణి చేశాయి. అది మాట్లాడిన దానిలో నేను చాలా భాగం వినిపించుకోనేలేదు.

"మీరు పెండ్లి చేసుకుంటే చేసుకోండి, లేకపోతే లేదు కాని, యిల్లాంటి మాటలు అనకండి. గోవిందం యెవడు వెధవ... అన్ని వొట్టి మాటలు. చేసుకోవడం యిష్టంలేక, యేదో తప్పించుకోడానికి యిట్లాంటివన్నీ కల్పిస్తారా? అవును ఆ మధ్య రెండురోజు లొచ్చి సంగీతం చెప్పి పోయాడు మా అమ్మవాడిని యేమన్నా ఆశ పెట్టిందేమో – వాడి పెండ్లాం ప్రసవించినప్పుడు, బలవంతంగా నా కోసం చంపేశాడని చెప్పుకుంటారు..."

"అల్లా, రా దోసలోకి, యేదో వుంది కథ... ఊరికే యెందుకు పుడుతుంది పుకారు?"

"అల్లాగంటే చూడండి మరేంచేస్తానో" అని జడతో నా కంఠం పైన కొడుతుంది. "ఒక రోజున, మా అమ్మ లేనప్పుడు భలే అల్లరి చేశాడు ఆ మట్టున నేను, మిరపకాయిల కారం చేతులకు రాసుకుని కళ్ళల్లో పెట్టి పారిపోయాను. మళ్ళా ఐపులేడు..... మీరు నన్ను...." అని మళ్ళా యేడుపు ప్రారంభించి, అట్లా తన శిరం నాకంఠంపైన ఆనించి యెంతసేపు యేడ్చిందో చెప్పలేను..."

* * * *

**"అధ్యాయం అయిదు:** రాత్రి పదకొండు దాటింది నేను మాయింటి వీధిగదిలో కూర్చుని చదువుకుంటున్నాను. బైట ఆకాశం విరిగి మీదపడేటట్లు పిడుగుల చప్పుడు; హోరున వర్షం కిటికీతలుపు వేసినా దీపం ఆరిపోతానని ప్రతినిమిషం బెదిరిస్తూవుంది. కాని నేను ప్రకృతిలో జరుగుతున్న కల్లోలం గమనించలేకపోతున్నాను. దానికి నే చదువుతున్న గ్రంథమే కారణం. ఆకథలో నేను నిమగ్నుడను అవటమే కాకుండా నన్నాదినాల్లో యెదుర్కున్న సమస్యకి గ్రంథాలలో సమాధానం దొరుకుతుందాన్న

ప్రత్యేకాభిలాషతో కూడా చదువుతున్నా. "దయ్యాలు... దయ్యాలు... జాగ్రత్త... తలుపులు వేసివున్నా, లోపలికి ప్రవేశించగలవు... అందులో సుందరమైన దయ్యాలు మరీ ప్రమాదకరమైనవి... వాటి సౌందర్యం నీముందు బహిరంగపరిచి, నీలోపలికి ప్రవేశించి, నిన్ను పీల్చిపిప్పి...." అన్న, హెన్రిక్ ఇబ్సెన్ రచించిన "దయ్యాలు" అన్న నాటకంలోని వాక్యాలు చదువుతోంటె తలుపు బిగ్గరగా తట్టుతున్నశబ్దం వినిపించింది. నిజంగా దయ్యాలేమోనని ఖంగారుపడి, లోపల నవ్వుకుని మళ్ళా చదువుతుండగానే, తలుపు పెద్దగా గుద్దినట్లు వినిపించింది. లేచి వెళ్ళి తలుపు తీశాను. ఏదో నల్లగా కనిపించగానే నాలుగడుగులు వెనక్కి నడిచాను. తడిసిపోయిన నల్లటిచీర, తెల్లటిరవిక, గదంతా నీళ్ళు చిమ్ముతూ, గుమ్మంలో, నుంచుంది పుష్ప. మనిషంతా తడిసి, ముద్దయిపోయింది. లోపలికి రమ్మని తలుపు బిగించి, పైనున్న తువ్వాలు తలతుడుచుకోమని, చేతికిచ్చాను. నిజంగా కన్నీరో, వర్షపునీరో తెలియదు కాని, ముఖంలో కళ్ళలోని తెలుపు, నలుపుని యేకం చేసేంతటి విచారంతో నిండివున్నాయి. గోడవెంపు తిరిగి, వెంద్రుకలు తుడుచుకుంటోంది, ఏదో మాట్లాడబోతుంది. నే దగ్గరగా వెళ్ళి చెవులో మెల్లిగా అన్నా "గట్టిగా మాట్లాడకు, యింట్లో వాళ్ళు లేస్తారు... ఉండు నేలోపలికెళ్ళి, మా అత్తయ్య చీరయేదేనా వుందేమో చూస్తాను, అని మెల్లిగా లోపలికెళ్ళి ఆరడానికి కట్టినచీర విప్పి మెల్లగా గొళ్ళెం తగిలించి, వెనక్కు తిరిగేప్పటికి, పుష్ప వివస్త్రఅయి, వొణికిపోతో, గోడవైపు తిరిగి నిలబడింది. దీపం తగ్గించి, నే కళ్ళుమూసుకుని, చీర అందజేశాను.

చీర ధరించి తడిసినవాటిని పిండి కుర్చీమీద పెట్టి, రవిక బదులు నాతువాలు పైన కప్పుకుని, తన చేతులు నాబుజాలమీద వేసి దీనంగా చూసింది.

"ఇట్లా అర్థరాత్రి వొంటరిగా మాయింటికి రావొచ్చునా? ఎవళ్ళకేనా తెలిస్తే యెంత తప్పు. ఈ చీకట్లో యీ వర్షంలో నాకు వొంట్రిగా కూర్చోడానికే భయంగా వుందే... పైగా నేనిక్కడ కూర్చున్నాను కాబట్టి సరిపోయింది. లేకపోతే, తలుపు తట్టి అందర్నీ, లేపి అల్లరి చేసేదానివేనా... అదిగాకపోయినా, యెందుకు యింకా నా దగ్గరకి రావడం?

"మిమ్మల్ని చూసి మూడునెల్లు పైగా అయింది. మీకుకోపం వొచ్చి రావడం మానేసినా, నేను మిమ్మల్ని చూడకుండా వుండగలనా. ఇంట్లో వాళ్ళని లేపి అల్లరి చేసేదాన్నా? ఎప్పుడేనా అల్లాచేశానూ? మీరు మొదలు నాకు ప్రేమించడం నేర్పి, పెండ్లి చేసుగోడానికి యిష్టపడక, యేవో లేనిపోని అనుమానాలు పెట్టుకుని, నాకు ఆఖరికి కనిపించడంకూడా మానేస్తారా? నామనస్సుని, విచారాన్ని కొంచెమైనా మీరు గమనించ కూడదు?"...

"ఎవళ్ళు గమనించాలోవాళ్ళే గమనిస్తారు. ఈ మధ్య ఎవరితోనో లేచిపోయావుటగా..." అని నా మొఖంమీద పడ్డ చీరకొంగును అవతలకి తొలగించాను.

"రామ, రామ... మాఅమ్మ నన్ను మాయచేసి తీసికెళ్ళింది దాని కెంతసేపూ, డబ్బుగోల - అవుతే నే వొప్పుగున్నానా? ఆ రాత్రి వాళ్ళందరితో నాకూ మీకూ ఉన్న స్నేహం చెప్పేసి, నగలు తీసుకొని నేను అమ్మా చక్కావొచ్చాం.... నేను యింత అర్థరాత్రి రావడానికి కారణం వుంది, వినరూ?...."

తరవాత మాట్లాడడం మానేసింది. అమాయకపు కన్నీటి చుక్కలు కండ్లలో మెరుస్తున్నాయి. నేను పైనున్న తువ్వాలుతో తుడుస్తున్నాను.

"నాలుగు నెలల క్రితం మీకు జ్ఞాపకం వుందా మా యింట్లో, యిప్పుడొచ్చినట్లుగానే వర్షం రావడం; మీరు మళ్ళా యెల్లా యింటికి వెళ్ళనా అని భయపడటం; నేను వెళ్ళనీయకుండా తెల్లవార్లు ఆపుజెయ్యటం..."

నేను అవి స్మరిస్తూ 'ఊ' అనడంకూడా మానేశాను. తటాలున లేచి కూర్చుంది.

"నిశ్చయం చేసుకున్నానండి, రేపు మీ నాయనగారి పాదాలమీద పడి అడుగుతాను- ఒప్పుకోకపోతే మీకు చాలా యిష్టమన్నారే – ఆ కాశ్మీరదేశం పోదాం. మీరు వర్ణించిన ఆ సరస్సులూ, ఆ పడవలూ, నీటిలోని చంద్రబింబం, ఆ నిర్భయమైన ముద్దు...." అని నా అదరాలను తాకింది. "పోదాం, మనం కాశ్మీరంపోదాం నా దగ్గఱున్న నగలమ్మితే, నాలుగువందలేనా వస్తాయి. ఈ మధ్య మా అమ్మ నాకు వీణకూడా నేర్పిస్తోంది... పాటలు పాడుకుందాం. తరవాత దేముడే..."

"అయ్యబాబో మా వాళ్ళతో చెప్పడమే.... మనం కాశ్మీరం పోయినా, నువ్వు సరిగ్గా వుంటావా – మీ అమ్మ వుండనిస్తుందా?"

"అల్లా అనకండి. అన్నీ పిచ్చి అనుమానాలు మీవి. నాకు మీరు తప్ప యేం కావాలి? అదేనా, నన్ను మీరే కోరుకున్నారు. మా అమ్మ అడ్డంవొస్తే చంపిపారెయ్యను! నేను మీ కోసం యింత చేస్తున్నప్పుడు మీరు పురుషులయివుండీ, యేమీ చెయ్యలేక పోతున్నారే..." మళ్ళా నా శిరస్సుని తన చీర కొంగులో కప్పేసుకుంది."

* * * *

తరువాతి అధ్యాయాలన్నీ చాలా పెద్దవి. పైగా అవి పైవాటంతటి విశదంగాలేవు. అందులో నమ్మరానివి, రహస్యమైనవి ఆత్మవంచనతో కూడుకున్నవీ అవడంవల్ల, ఆ నాయకుడి ఊహాలోనైనా విస్ఫుటంగా విహరించడంలేదు. వాటిల్లో కొన్ని మాత్రం, సత్యమైన ఆకారం కలిగి ఉన్నాయి.

**"అధ్యాయం ఆరులో:** నేను పెండ్లికూతురు మెడలో పుస్తె కట్టబొయ్యేముందు, అందరివెంపూ వొక్కసారి పరకాయించి చూశాను. నాలోపల ఉన్న ఆవేశాన్ని యెవ్వరూ అర్థంచేసుకుని, నాకు ఉత్సాహం చూపిస్తూ తలపంకించినవారు లేరు. పదిహేను గజాలదూరంలో, స్తంభం వెనకాల నిలబడి పుష్ప నవ్వుతూ, 'కానీ' అన్నట్లుగా చేతులతో సంజ్ఞ చేసి, యీ సముద్రంలో యీదులాడేందుకు తగినంత ధైర్యం, బలం కూడా సమర్పించి, తన వొడ్డునే నిలబడి చప్పట్లు కొట్టింది. బ్రాహ్మలు మంత్రాలు చదివారు; సన్నాయి మోగింది. నాకర్థంకాని యీ దేదీప్యమానమైన చీకటిలో నాకు పుష్ప నవ్వు వొక్కటే కనిపించింది..."

* * * *

**"అధ్యాయం ఏడు:** "ఏమండోయ్ మనమ్మాయి భారసాలకి, మా మావయ్య లగ్నంకూడా పెట్టాడు. మీరు యెవరెవరికి రాసుకోవాలో, లేఖలు వాళ్ళకి రాసుకోండి.."

* * * *

**అధ్యాయం ఎనిమిది:** "ఏమండోయ్, మన "మనూ" స్కూల్ ఫైనల్ పరీక్ష ప్యాసయిందిట. వాళ్ళ హెడ్‌మాస్టర్ దగ్గరనుండి టెలిగ్రామ్ వొచ్చింది. టీపార్టీకి సన్నాహం కానీయండి..."

**అధ్యాయం పది:** ... "Complication కూడా వుంది. చెప్పలేం, రిసల్టు ఎందుకేనా మంచిది మీ వాళ్ళకు, intimation యివ్వండి" అన్నాడు నా గుండె పగిలేటట్టు, డాక్టర్ కామత్. మంచం ప్రక్కన 'స్టవ్' ముట్టించి, ఓవల్టీన్ తయారుచేస్తోంది పుష్ప. నేను పడకకుర్చీలో చేర్లబడి వున్నాను. దగ్గరగా వొచ్చింది పుష్ప.

"ఎట్లాగా యిప్పుడు పాపం, ఆడపిల్లకూడా దగ్గరలేదే. మీరు విచారించకండి. మనం చేతనయినంత వరకూ ప్రయత్నిద్దాం – తరవాత దేవుడుమీద భారం... అదిగో, ఆ యేడుపే వొద్దన్నాను. పాపం, ఆ యిల్లాలు యెంత దిగులుపడుతుంది" అని పుష్ప తువ్వాలుతో నా కన్నీటిని తుడిచి నన్ను వోదార్చింది....

②

**త**నజీవిత గ్రంథంలోని యీ జరిగిపోయిన అధ్యాయాలను యెన్నిమార్లు తిరగవేసినా, ప్రస్తుతం నిర్ధారణకు రాలేకపోతున్నాడు. జగన్నాథస్వామి. కవరు చించి ఉత్తరం తీసేటప్పటికి, అందులోంచి వాడిపోయిన గులాబిపువ్వురేకలు క్రిందికి పడ్డాయి. ఆ లేఖను చివరదాకా చదవడానికి సాహసించ లేకపోతున్నాడు. సావధానంగా చదువుకుంటే తనకి సంతోషం కలిగించే విషయాలు చాలా వుంటాయి, అందులో. కాని తను మరిచి పోదలచుకున్న సంగతులుకూడా ఉన్నాయి. దానిలో కొన్నిభాగాలు –

"పైన మిమ్మల్ని డార్లింగ్ అని సంబోధించాను. మీరు నేను డార్లింగులం కాము. అప్పుడే మీకు ముప్ఫయి నాలుగేండ్లు పూర్తయ్యాయనుకుంటాను. అట్లా వ్రాయడానికి కారణం, చిన్నతనంలో మీరు నేర్పిన ఇంగ్లీషు ముక్కలను, మళ్ళా సాధించి యిప్పటికి ఉత్తరానికి చాలినంత పాండిత్యం సంపాదించాను.... ఎప్పుడూ నాబుగ్గలను గులాబీ పుష్పాలతో పోల్చేవారు మీరు; అందుకనే, ఆరేకలుకూడా, యిందులో పెట్టి పంపుతున్నాను.... నన్ను స్వీకరించమని కోరడానికి కారణం నాకు డబ్బులేకా, తిండిలేకా కాదు. ఏదో నలుగురైదుగురు పిల్లలకు వీణ నేర్పుతూ, రోజులు వెళ్ళబుచ్చగలుగుతున్నాను. నిజమైన విషయం యేమిటంటే, యిప్పుడు నేగడుపుతున్న జీవితం నాకు నచ్చలేదు. నాకు భర్తతో వొక గృహంలో కాపురముండి, అందరిలాగా నిశ్చింతగా వుందామని కోర్కెగావుంది. రోడ్లమీద నడిచే భార్యాభర్తల జంటలను చూస్తుంటే నాకు చాలా బాధగాను, యీర్ష్యగాను వుంది. సంసారంలోని స్త్రీకి, క్షేమం, స్వేచ్ఛ, ఆదరణ, గౌరవం ఉన్నాయి. నా జన్మకి వీటిని నాకుకూడా, యెందుకు అర్పించకూడదు? నాకు కులగోత్రాలు లేవనీ, లేచొచ్చినదాని కూతుర్ననీ అనేక పేర్లు పెట్టి, నన్ను అందరికీ దూరంచేశారు. నాకు నీతి లేదంటారు. బైటికి కనిపించే మంచి విషయాలు లేకపోవొచ్చు కాని నాలో, మీ సావాసం వల్ల అబ్బిన, కొంత నిజమైన మంచి ఉన్నది. చూడండి, మీరు భార్యతో కాపరంచేస్తున్న రోజులలో, మిమ్మల్ని బాధించి, పాపం, ఆవిడకు యెప్పుడైనా, అసూయ కలిగేటట్లు

చేశానా? మీకు నిజంగా నన్ను స్వీకరించాలని వుందని నాకు తెలుసు. కాని పదిమందీ యేమనుకుంటారోనని భయపడుతున్నారు...."

మళ్ళా చదవడం మాని ఆలోచించడం మొదలెట్టాడు, జగన్నాథం. భార్యపోయిన నాటినుండి, వొంటరిగా వుండి బెంగడిపోతున్నాడు. అసలతనిది బెంగపడి, ప్రతిదానికి యెడతెగని ఆలోచనచేసే స్వభావం. అతన్ని ప్రతినిమిషం, యెవరో ఆదరించి, ధైర్యం చెప్పేవారు లేకపోతే, దిగులుతో క్రుంగిపోతాడు. అతనికున్న ముప్పయి ఐదు సంవత్సరాలలో, బాల్యంలోని పదేండ్లు తీసేసినా, మిగిలిన పాతికేండ్ల అనుభవం, విజ్ఞానం ఉన్నా కర్తవ్యానికి దిగలేక పోతున్నాడు. పుష్ప మారిపోయి తనకి పిచ్చెత్తించేటంతటి సుందరాంగనగా తయారయింది. ఆమెవ్రాసిన లేఖనుబట్టిచూస్తే ఆమె కున్నది వొక్క సౌందర్యమే కాకుండా ఉన్నతాశయాలు, తన యెదురుగావున్న వొక్కదైవాన్నే ఆరాధించే అంతరాత్మకూడా ఉన్నాయి. భగవంతుడు, ఆమెను సృష్టించడంలో, భారం తలిదండ్రుల మీద పూర్తిగా వెయ్యకుండా ప్రత్యేకంగా శ్రద్ధతీసుకుని అతీతమైన శిల్ప చాతుర్యం చాటుకున్నాడు. అన్ని విధాలా ఆమె తనకు కావలసిందే. కాని ఆమె వెనుకటి చరిత్ర నీతిదాయకమైంది కాదు. ఆ సంగతులు యెల్లానూ మరిచిపోయి, పెండ్లిచేసుకొనో, లేకపోతే, వూరికే తన యింట్లో వుంచుకుని భార్యగా చూసుకొంటోనో వుందామన్నా సంఘం అతని చర్యను విమర్శిస్తుంది. పూర్తిగా దుర్నీతిపరుడనకపోయినా, నీచమైన ఆదర్శాలు కలవాడని నిందిస్తుంది. తన స్వంత సమస్యని, జగన్నాథం, ప్రపంచ సమస్యలోకినెట్టి, అనేక ఆచారాలలో మరుగుపడిన పాత సమస్యలని లేవగొట్టాడు. పుష్పలా కులం, జాతీలేని స్త్రీలు యెందరున్నారో హిందూ సంఘంలో మంచిగా వుండి, అన్ని విధాలా నిక్షేపంలా ఉన్న వాళ్ళని యింకా మంచిగా ఉండమనీ, యింకా అభివృద్ధి చెందమనీ శాసిస్తుంది కాని సంఘం, మంచిగా వుండేందుకు అభిలాషవున్నా అవకాశాలు లేని అసహాయులకు అవకాశాలు కల్పించదే! ధనం, అవకాశం, కొంత లోకజ్ఞానం ఉన్న ఉత్తమ కుటుంబాలలోని ఏ పదిమందికోసమో సంఘం నైతిక దేవాలయాన్ని నిర్మించి అందులోకెళ్ళి ప్రార్థించమంటుంది. కొందరు పుష్పలాంటి స్త్రీలు, స్వహస్తాలతో తయారుచేసుకున్న మట్టివిగ్రహాన్ని తనలాంటి విశాలహృదయుడు దేవాలయంలో ప్రతిష్ఠించడానికి ప్రయత్నించినప్పుడు సంఘం అతన్ని అస్పృశ్యునికింద చూసి అతని వునికిని బహిష్కరిస్తుందే! ఈ నీతి, దేవాలయాలలోనేకాక మానవుల జీవితాలలో ప్రతినిత్యము గంతులెయ్యాలన్న సంగతి గమనించదే. ఏ చింతా లేకుండా, సంతుష్టి చెంది హాయిగావున్న ప్రతివ్యక్తీ సంఘానికి శత్రువే అంటాడు హెన్రిక్ ఇబ్సెన్. సంఘం నిర్మించిన ఆదర్శాన్ని తనదిగా భావించుకుని దానికి అనుగుణ్యంగా ప్రవర్తించడంవల్లే, లోకంలో యిన్ని భగ్నజీవితాలు మృతకళేబరాలు నిప్పులలో నాట్యమాడుతాయన్న ఇబ్సెన్ గోలని లోకంపిచ్చివాని వున్మాదంగా పరిగణిస్తుందే. హిందూ సంఘానికి మూలాలయిన, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర విభజన ప్రస్తుత పరిస్థితులలో యెంతవరకూ అర్థమైనదో అన్నది పెద్దసమస్య. ఈ నైతికసంఘ పరిపాలకులను, యీ విషయాన్ని గురించి ప్రశ్నిస్తే, వారిలో పూర్వాచార పరాయణులిచ్చే సమాధానం "అంతా దైవవిధి – వారి వారి కర్మ అని;

వారిలో కొంచెం నవీనభావాలున్నవారు చెప్పేది "ఆ సమస్య మాది కాదు. అది ఆర్థిక సమస్య. దేశానికి స్వతంత్రం లభిస్తేనేకాని, పరిష్కారం కాదు. సోషలిస్టులను కనుక్కోండి..." అని. దీనిమాట యిల్లా ఉన్నా. తనబోటివాడు సంఘనీతికి అర్థంకాని, దానిని అతీతమైన మార్గాన్ని అనుసరించి ప్రవర్తిస్తే, లోకంచూసి ఓర్వలేక, నిరసిస్తుంది. "ఇతరులందరికంటె కూడా, యెక్కువ "మంచి"గా వుండానికి ప్రయత్నించిన వ్యక్తి, అవినీతికరమైన గుమ్మంలో అడుగుపెట్టాడన్నమాటే" అని, తన జీవితం అంతా ధారబోసి చెప్పగలిగాడు. పాశ్చాత్య సంఘ సంస్కర్త బ్రాడ్లె. తన కర్తవ్యం వివాదాలు పెంచడంకాదు. తను ఆత్మవంచన లేకుండా స్వవిషయాన్ని సాధించాలి; పుష్పని తనతో వుండమన దలచుకున్నాడు. ఆఖరికి జగన్నాథం. మళ్ళా ఉత్తరం చదవడం ప్రారంభిస్తాడు.

"....మీరు నన్ను మీ గృహిణిగా అంగీకరించేముందు మనం ముఖాముఖిని మాట్లాడుకోలేని సంగతులు గమనించాలి. మీరు నన్ను వీధిలో వొదిలేసి గృహస్థులైనప్పటి నుంచి, నాజీవితంలో శాంతిలేదు. స్వార్థపరులు, మీ ఉత్తమ కుటుంబీకులు, నన్ను వారి ఆనందానికి ఆధారంగా చేసుకుని వాసనచూసి మళ్ళా గిరవాటేశారు. నేనేమి చెయ్యలేను. దానికి కారణం చెప్పలేను. విచిత్రవ్యక్తులు వారి అదరాలికి పట్టిన బూజును తుప్పునూ నా శరీరానికి రాశారు. నేనవన్నీ అసహ్యించుకుని, ఆ శరీరాన్ని వొదిలేసి, కొత్తరూపం దాల్చదలుచుకున్నాను. మీరూ యివన్నీ అర్థంచేసుకుని, మరిచిపోయి, క్రొత్త జన్మ దాల్చే నన్ను మీపాదాలముందు కూర్చుని, మీ జోళ్ళకి పాలిష్ వెయ్యనివ్వాలి. మీకు సర్వచాకిరీ చేస్తాను. మీ పిల్లని, తల్లిని మించిన ప్రేమతో పోషిస్తాను. నన్ను తల్లిగా వుండనీయండి. ఆ పవిత్రతా, ఆ శాంతి నాకూ కావాలి. నా శరీరాన్ని చంపారు, నా మనస్సునైనా వికసించనీయండి. నాకుస్థానం. ఆకాశంకింద కాకుండా మీ నీడలో యియ్యండి. నేడే వొచ్చి మీ యింటిదీపం వెలిగిస్తా..."

జగన్నాథంలో, విషాదం ఆవేశం చెలరేగాయి. ప్రతి వాక్యంలోను, తన అనుభవంలోను వినలేకపోయిన సందేశాన్ని వినగలిగాడు. మహాకవులూ, వేదాంతులూ చెప్పగలిగిన సందేశమే యీ లేఖలో, వొక నీచకుటుంబంలోని స్త్రీ, ప్రేమతో ముచ్చటించ కలిగింది. నువ్వు మంచిలోవున్న తమాషా పొందాలంటే, అప్పుడప్పుడు చెడుగా ప్రవర్తించా లంటాడు. బ్రౌనింగ్ - వెలిగిన జ్యోతిని, చేతులారా ఆర్పుకోవాలంటాడు. సంఘానికి నీతిని గురించిన భావాలు తప్ప నీతిలేదు. పురుషులకు ప్రేమని గురించిన భావాలుతప్ప నిజమైన ప్రేమలేదు. ఆ ప్రేమని నిరాకరించి, అనేక మాయకారణాలతో సమర్థించు కుంటారు.

పుష్పను తనింటికి రప్పించుకోడానికి ధైర్యం లేకపోడానికి కారణం, పదిమందీ యేమనుకుంటారో అన్నది కాదు, దానికి కారణం అతని మనస్సే, అన్యులతో పోయిన స్త్రీని తను యెల్లా అంగీకరించగలడు? "విచిత్ర వ్యక్తులు వారి అధరాలకి పట్టిన బూజును నా శరీరానికి రాశారు. అనిరాసి, దానికింద ఎర్రసిరాతో గీత కూడా గీసింది, ఆ వాక్యమే అతనికి బాధ కలగజేసింది. భార్యతో కలిసివున్నప్పుడు, బైట యెల్లాంటి రహస్య ప్రవర్తనలూ చెయ్యడానికి పురుషుడు వెరవడు. ఆ సందర్భంలో మనస్సులో, యేలోటూ, యే senti-

mental scruple కనిపించదు. భార్యను వొదిలి దూరంగా ఉన్నప్పుడూ, లేక అసలు భార్యే లేనప్పుడు, పురుషుడు చెడుగా ప్రవర్తించడానికి జంకుతాడు. కారణం? భార్యవుంది కదా అని సంతుష్టిచెంది, సంఘనీతి అతని దుష్ప్రవర్తనలని మన్నిస్తుంది. పురుషుడు తను స్త్రీలో కోరే మానసిక స్వచ్ఛత, తనూ యెందుకు అలవరుచుకోడు? చాలా irrational being, పుష్ప అన్నివిధాలా తనకి కావాలి, సంఘాన్ని కూడా పాటించదు! మళ్ళా పుష్ప పూర్వగాథ అంగీకారమైనది కాదు, irrational being....

జగన్నాథం యింతవరకు ప్రేమిస్తోన్నది "ప్రేమ" అనే ఆకారం లేని వొక భూతాన్ని. దాన్ని గురించి వాదవివాదాలు పెంచుకుంటున్నాడు తన హృదయంలో మూసుకున్న కన్ను తెరిచి యధార్థం పరిశీలించాడు. అన్యులు చెప్పిన సందేశాలు, తర్కంలోకి తప్ప ప్రత్యేక వ్యక్తులకు అన్వయించవు. తనకు తాను తప్ప, యీలోకంలో యెవ్వరూ సహాయం చెయ్యరు. సింప్‌సన్ సతిని వివాహమాడతానన్న ఎడ్వర్డుకి బ్రిటిష్ యంత్రాంగం ఏం సహాయం చేయగలిగింది. సింపసన్‌కి పూర్వపు భర్త వున్నాడని రాజుకు తెలియదూ? అతను అమాయకుడా? అతను ఆమె పూర్వగాథ మరచి, మన్నించి, స్వీకరించలేదూ? ప్రేమకోసం పెద్దపెద్ద సామ్రాజ్యాన్ని త్యాగం చేసినప్పుడు, తను, వొక చిన్న అర్థంలేని sentimental scruple ని త్యాగం చెయ్యలేదూ? సింపసన్‌లో బ్రిటిష్ సామ్రాజ్య త్యాగానికి సమానమైన నీతి ఎడ్వర్డ్‌కి కనిపించలేదూ? ఐదు ఖండాలవారు, టోపీలు దించి ఆ చర్యని ఆమోదించి చప్పట్లు కొట్టలేదూ?

వెంటనే, తక్షణం బయలుదేరి రావలసిందని కోరుతూ ఉత్తరం వ్రాశాడు జగన్నాథం. అందులో చివ్వరి వాక్యాలు, "నేను నీపూర్వపు విషయాలు మన్నించి, మరచిపొయ్యాను. మనం, అన్యోన్యంగా..." ఎందుకో అగ్గిపుల్ల ముట్టించి, ఈ లేఖని అంటించి వేశాడు, మరోలేఖ వ్రాశాడు అందులో... "...నాకు యే ఆటంకమూ లేదు. అవన్నీ మరిచిపోతాను, నిన్ను యింకనుంచి సంశయించను. నా కూతురు విషయం మొదట్లో అనుమానించాను. ఇప్పుడది, పూనాలో చదువుకున్న విషయం మొన్న చెప్పాగా నీకు. దానికిది బోధపడుతుంది. నీ ఉనికికి ఏ అడ్డూ అది చెప్పదని నా నమ్మకం. నాకింక అన్యులను గురించి ఆలోచించవలసిన అవసరంలేదు. ప్రస్తుతం, నాకు నువ్వు తప్ప వేరే అన్యులులేరు. అదీగాక, నా "మనూ"లో పూర్తిగా నీ పోలిక నాకు కనిపిస్తుంది. అది చాలు దాని మనస్సుని స్థాయిపరిచేందుకు... ఏదీ ఆ గులాబీపువ్వు రేకులతో నా మీద నృత్యం సాగించు..." ఇది కవర్లో పెట్టి అతికించాడు. కాలిపోయిన ఉత్తరాలమసి గాలిలో పడి వీధులోకి ముక్కలు ముక్కలుగా యెగిరిపోయింది.

## ③

పోస్టుబంట్రోతు అందజేసిన ఉత్తరం తీసుకుని, హాలులో కుర్చీమీద కూర్చుంటుంది పుష్ప. గది చాలా అలంకారంగా వుంది. గోడమీద జగన్నాథం తన భార్యతో తీసుకున్న "ఫోటోలూ, మనోరమది పెద్ద enlargement కొన్ని రవివర్మ బొమ్మలూ ఉన్నాయి. తను కుడుతోన్న చిరుగులాల్చీ బల్లమీద పెట్టి, "నాథ్" అని కేక పెట్టింది పుష్ప. నాథ్ యీలవేసుకుంటూ, హాలులోకి ప్రవేశించి ఉయ్యాలబల్లమీద కూర్చుంటాడు.

"మన మనోరమ పూనానుండి ఉత్తరం రాసింది. నేను చదవనా?" అంది.

"ఏదీయిల్లా యియ్యి. ఇంగ్లీషులో వ్రాసింది నీకేం తెలుస్తుంది?

"ఓ యబ్బ – చూడండి "డియర్ ఫాదర్ యూర్ కిండ్ లిటర్ టొహాండ్ స్లిప్...." ఉండండి, చదవనియ్యండి" – ఇంతలో, అతను లేచి, ఉత్తరాన్ని లాక్కుని చదువుకుంటాడు. పుష్ప అతని వెనకాల కూర్చుని, తొంగి చూస్తుంది. జగన్నాథం ఆ ఉత్తరం చదువుకుని మెల్లిగా నవ్వుతాడు.

"ఏమండీ, ఏమని రాసిందో చెప్పరూ? ఎందుకూ నవ్వుతున్నారు?"

"ఏమీ లేదు ఊరికేనే..."

"అంతా చిత్రమండీ మీది... చెప్పరూ..."

"దానికి రూ. 70 మనియార్డర్ పంపమంటుంది."

"అంతేనా మూడు పేజీల ఉత్తరమూను?"

"ఈ సెలవలకి, యిక్కడకు రాదుట..."

పుష్ప బిక్కమొహం వేసింది.

"వాళ్ళ స్నేహితురాలితో గడుపుతుందిట, యీ నెలరోజులు."

"తరవాత, నా విషయం యేమని రాసింది?"

జగన్నాథం నవ్వుతాడు – "నువ్వు చాలా మంచిదానవని రాసింది."

"ఊ వెదుదురూ మీవన్నీ మాయ మాటలు. నేనున్నానని యిక్కడికి రావటం మానెయ్యలేదుకద" అని పుష్ప చీరకొంగు తన బొటనవ్రేలుకి చుట్టుకుంటుంది. నాథ్ వుయ్యాలా దిగి, ఆమె భుజాలపై చేతులానించి, ముందుకు తోస్తాడు.

"మీ హాస్యాలకేం గాని యేం వ్రాసిందో చెప్పండి."

"చెప్పాగా. నువ్వు నమ్మకపోతే యేం చెయ్యను" నువ్వు చాలా మంచిదానవనీ, నాకు చాలా సహాయకారిగా వుంటావనీ, తనకి అందువల్ల చాలా సంతోషంగా వుందనీ, నిన్ను చూడాలని, నీచేతి అన్నం తినాలని మరీమరీ వుందని – వొకటేమిటి ఈ ఉత్తరం అంతా నిన్ను గురించి స్తోత్రమే...."

అతన్ని కూడా ఉయ్యాలపైకి లాగింది.

## ④

అవి వేసంగి శెలవలు. ఆ రోజు మధ్యాహ్నం మూడుగంటలబండిలో తన స్నేహితుడుతో కలిసి, పూనా నుంచి వస్తున్నానని మనోరమ ఉత్తరం వ్రాసింది. గోడలకి వెల్లవేసి ఇల్లంతా అలంకరించడంలో మూడు రోజులు జరిగిపోయాయి. ఆ ఉదయం తలకి స్నానంచేసి కొత్తదుస్తులు ధరించుకుని, గోడనున్న తన ఫోటోముందు నిలబడి కేలండర్‌లో వెనక పడ్డ దినాల కాగితాలు చింపుతోంది పుష్ప. ఆ రోజున అలంకారం మార్చింది. మధ్యపాపిడిరేగి కళ్ళమీదపొడిగా పడుతున్న ముంగురులూ, అలంకారాలు తీసేసిన చెవులు, పెద్దకుంకుమబొట్టు, నాలుగంగుళాలు వెడల్పుగల నల్లంచు సాదా ఖద్దరు చీర, అదేరంగుగల గళ్ళజాకెట్టు, వొంకరగా మెలితిప్పికట్టిన సిగమీద, అప్పుడే తామర

పద్మంలో మొలుచుకొచ్చిన మూగబ్రహ్మలా అమర్చబడ్డ రెండు చామంతి పువ్వుల మధ్య నున్న గులాబి పుష్పం – మొత్తంమీద, సివిలైజ్డ్ శకుంతలలాగ వుంది.

జగన్నాథం వెనకాలె వెళ్ళి, పుష్ప నేత్రాలు తన చేతులతో మూశాడు. "ఎవరు చెప్పుకో?"

"కాబోయే అత్తగారి ప్రియుడు, లేక డార్లింగ్" అని చేతులు తొలగించి వెనక్కి తిరిగి చెక్కిలిని అతని పెదవులకు తగిల్చింది.

"చాలా అర్థం తీశావే?" అన్నాడు.

"మీరే చెప్పారుగా, మనోరమ వొక ఫ్రెండుని తీసుకొస్తోందని. ఫ్రెండు, మీ రంగీకరిస్తే యెంతసేపులో లవర్‌గా అవడు? అల్లాంటప్పుడు నేను అత్తగార్ని కాను...?"

నాథ్, యీ చమత్కారానికి నవ్వుకున్నాడు.

"ఇవాళ చాలా యింపుగా ఉన్నావు"

"కాదు, మీ మనస్సు యింపుగా మారింది. మనకి రోజురోజు, యీ ప్రపంచం, వింతగాను, సుందరంగాను కనిపించడంలేదూ? కన్నీటి సముద్రం యీది, ఇద్దరం వొడ్డుకి చేరుకున్నాం. మనగృహంలోకి, యివాళ యిద్దఱు పపిపాపలు ప్రవేశించి, ప్రేమరాజ్యం యేలుకో బోతున్నారు. నేను తల్లిగా వుండదలచుకున్న కోరిక సాఫల్యం కాబోతోంది. అత్తనికూడా కాబోతున్నాను. నా జీవితం సఫలం కాబోతోంది. దైవానికీ మీకూ నానమస్కారాలు. నా కింక మృత్యువంటే భయంలేదు... అని కిటికీలోంచి చూస్తూ మాట్లాడింది పుష్ప. నాథ్ వెనకాల నిలబడి ముంగురులను సవరిస్తున్నాడు.

"ఏం పుష్పా, యివాళ వేదాంతంలో పడ్డావ్ – మహా ఇరవైమంది పిల్లలుగల వృద్ధురాలుగా మాట్లాడుతున్నావే..."

"కాక మనం చిన్నవాళ్ళంటండీ. నిన్న లెక్క పెట్టాను. నా తలలో అప్పుడే ఇరవైనాలుగు నెరిసిన వెండ్రుకలు కనిపించాయి. నవ్వినప్పుడు కళ్ళకింద గీతలు పడుతున్నాయి. కాని అన్యోన్యంతో నిండిన మన హృదయాలింకా లేతవే..." అని, 'కాదు?' అన్నట్లుగా మొహం చిట్లిస్తుంది. అతనేదో చెయ్యబోతాడు.

"అబ్బ వుండండి – చూడండి నాగుండెలు సంతోషంతో యెల్లా గొడవగా కొట్టుకుంటున్నాయో?"

"దీనికేంగాని, యివాళ వేదాంతంలో పడ్డావే."

"మీ కింకా తెలీదు కాబోలు. ఈ మధ్యరోజూ మీరు అవతలికి వెళ్ళగానే, భగవద్గీత చదవడం మొదలెట్టాను. ఆపుస్తకం యెవ్వ్రరాశారో గాని, భలేగా రాశారండి. అన్నీ నే అనుకున్న సంగతులే. ఆది రాసినాయనికి, మనం చేతులు జోడించొచ్చు..."

"అది శ్రీకృష్ణపరమాత్ముడు రాశాడు..."

ఆ, వొట్టిది. అన్నీ దొంగమాటలు. దేముడు మీ కోసం, చదువుకోండి నాయనా అని పుస్తకం రాస్తాడా! అనేక కష్టాలు పడి, మంచి నేర్చుకున్నవాళ్ళు తప్ప, యెప్పుడూ మంచిగావున్న దేముడు రాస్తాడా, నేను నమ్మను. మీరిన్ని చెత్త పుస్తకాలు చదువుతారుకాని, అదెప్పుడేనా చదివారు? దానికిమాత్రం, "వేదాంతం" అని పేరు పెట్టారు. వేదాంతం

గాలిలో వుంటుందా? మనుష్యులకు అర్థంకాని ప్రతిదానికి "వేదాంతం" అని పేరు పెడతారా? అది పెద్ద పెద్ద పండితులు కొట్లాడుకోడానికి తప్ప మనబోటివాండ్లకు అర్థం యెందుకు కాదు..." ఇంకా యేదో చెప్పబోతుంటే, గోడనున్న పుష్ప ఫోటో క్రిందపడి, అద్దం పగిలి పెద్ద చప్పుడవుతుంది.

"వెధవఎలిక దారాన్ని కొరికేసింది" అనుకుని పగిలిన గాజుముక్కలని అవతల పారేసి, వొట్టిపటాన్ని అలమార్లో దాస్తుంది పుష్ప. జగన్నాథానికి యిది జరగడం, అశుభంగా తోచి, విచారం కలుగుతుంది.

"పడక పడక నీ ఫోటోయే పడాలి – చూడు నా గుండెలు ఆగిపోయాయి" అన్నాడు.

"పోనిద్దురు, వెధవపటం, శరీరాలే శాశ్వతం కానప్పుడు, దీనికోసం, మనం దైవాన్ని దూషించకూడదు. నాది అసలు "నాన్ లైసెన్స్ క్రీడ్" అంటే గాంధీగారి తత్వమన్నమాట..." అంది పుష్ప అద్దంలో చూచుగుంటూ.

"నాన్ లైసెన్స్ కాదు. నాన్ వైలెన్స్ క్రీడ్."

"ఏదో వొకటి – అబ్బ వొదలండి కొంగు. యింట్లోకెళ్ళి పూరీలు వొత్తాలి..." అని లోపలికి నిష్క్రమించింది.

* * * *

మూడుగంటల బండిలో, మనోరమ, స్నేహితుడు దిగుతారు. జట్కా దగ్గఱకు వెళ్ళి నిలబడ్డాడు నాథ్ ఆహ్వానించే నిమిత్తం. పుష్ప వీధిగుమ్మంలో నిలబడింది. సామాన్లన్నీ హాల్లోకి చేరేశారు. అంతా తలో కుర్చీలోను కూర్చున్నారు. పుష్ప గదిగుమ్మంలో తలుపు వెనకాల నిలబడింది.

మనోరమలో కొంత పుష్పపోలిక వుండడం నిజమే. కళ్ళల్లో నాథ్ తాలూకు బేలతనం కూడావుంది. బుగ్గనున్న చిన్న మచ్చుతప్ప విశేషించి చెప్పదగ్గదేమీ లేదు.

"నాన్నగారు! ఇతనే నాక్లాస్‌మేట్, యెండ్, ఫ్రెండ్, రంగనాథ్, వీరి తండ్రిగారు పార్వతీపురంలో హెడ్‌మాస్టర్. మొన్న క్రిష్టమస్‌లో, వీళ్ళవూళ్ళో వారం రోజులు గడిపాను."

"నాకు చాలా సంతోషంగా వుంది" అన్నాడు జగన్నాథం. ఇంతలో పళ్ళెంలో పూరీలు ప్లేట్లలో అమర్చి, బల్లమీద పెట్టింది పుష్ప.

"మన పుష్పమ్మ వొంట్లో కులాసాగా వుంటోందా?" అంది మనోరమ పుష్పకేసి చూస్తూ.

"ఆ. మే మిద్దరం, చాలా సుఖంగానే ఉంటున్నాం. క్రిష్టమస్‌కి నువ్వురాలేదని చెప్పి, వారు చాలా యిదయ్యారు. వీలుపడలేదు కాని, మేమిద్దరం నీ దగ్గరకే వద్దామని బయలుదేరాం కూడాను" అంటూ రంగనాథ్‌ని పరకాయించి చూస్తూంది పుష్ప.

కాసేపు ముగ్గురు, కాలేజీ విషయాలు, రాజకీయాలు ప్రసంగించి కాఫీ తాగి కిళ్ళీలు బిగించారు. రంగనాథ్ ముఖవర్చస్సు సాధారణమైనదయినా, సూటు బూటు చాలా హడావుడిగా వుంటాడు. ఇరవై రెండేండ్లే నంటాడుకాని, పాతిక పైమాటేనని చెప్పాలి. మొత్తంమీద బాగా రాపిడి తగిలిన శరీరంలాగే కనిపిస్తుంది. మొదట్లో కొంచెం కులాసాగా

మాట్లాడ కలిగినా, చివరికి మౌనం దాల్చి, యేదో బెంగపడ్డవానివలె, పరాకుగా మాట్లాడ్డం మొదలెట్టాడు.

స్నానాలు చేసి, కొత్తబట్టలు ధరించి, మనోరమ తన స్నేహితుడితో, తోటలోకి షికారుకని వెళ్ళింది. పుష్ప తలకాయ నొప్పిగా వుందన్న నెపంమీద జగన్నాథాన్నికూడ, వెళ్ళకుండా యింట్లోనే ఆపుజేసింది. వాళ్ళు అవతలి కెళ్ళింతర్వాత వీధి తలుపు ఘడియేసి నాథ్ దగ్గరగా కుర్చీలాక్కుని కూర్చుంది.

"ఏమండీ, యితనేనా, మనోరమ ప్రియుడు?" అంది అతి మెల్లగా.

"ఇతనే – బాగానే ఉన్నాడు కాదు? తెలివైనవాడిలాగే కనిపిస్తుంది...."

"ఇతని పేరు?"

"విన్నావుగా, "రంగనాథ్‌ట" బహుశా యే రంగనాథరావో అయివుంటాడు."

"ఏమో వాడితలకాయ నాథ్ – నాకేమీ నచ్చలేదు, వాడివరస. కళ్ళల్లో కపటం, మాయా, కనిపించాయి. పైగా మన "మను" చాలా లేతది సుకుమారి – యీ దౌర్భాగ్యుడి కివ్వడం యేమిటి – వీడి వరసచూస్తే, బోగంకొంపల్లో తిరిగేవాడులా వున్నాడు..."

"ఏం అతనిమీద పట్టించావు, వాళ్ళొచ్చి, ఘడియ కాలేదు."

పుష్ప అతనివేపు ఇంకా దగ్గరగా, జరిగి, అతని హస్తాన్ని తన అరచేతిలో వుంచుకుని "మీరు నన్ను విశ్వసిస్తారు కాదు?"

"అందుకు సాక్షి" అని, ఆమెను ముద్దెట్టుకోబోతాడు.

"అబ్బ, వుండండి... అవుతే, నేచెప్పినట్లుచేస్తారు...."

"మంచిదని తోస్తే అల్లాగే."

"అల్లాగైతే, మన "మను"ని యితని సంపర్కంనుండి తొలిగించాలి..."

"కారణం" అంటాడు ఆశ్చర్యంతో.

"చాలా వుంది. నాచేత చెప్పించకండి; అవన్నీ జరిగిపోయిన విషయాలు: మనం యింతవరకూ మరిచిపోగలిగిన, చెడు సంభవాలు... నా నోటంట, ఆ పాతకం రానియ్యకండి – నే ఉత్తరంలో రాసి కింద గీత గీసిన బూజుపట్టిన అధరాలూ, విచిత్ర వ్యక్తులూ జ్ఞాపకం ఉన్నాయా... అంతే..."

ఈ సంగతి విని, జగన్నాథం నేత్రాలు మూసుగుని, వెనక్కి వొరిగిపోయాడు. అతని ముఖాన్ని తన చేతులలో తీసుకుని, సముదాయించడం మొదలెట్టింది పుష్ప. కొంతసేపటికి కండ్లు తెరిచాడు.

"నీతో...అతను..."

"అవును; వద్దు. పూర్తిగా అనకండి. నేనూ, మీరుకూడా మర్చిపొయ్యాం. మన మనుని, యీ దుర్మార్గుడి బారినుండి తొలిగించాలి... చమత్కారంగా చెప్పండి."

* * * *

రాత్రి తొమ్మిదింటికి అంతా భోజనాలు చేశారు కాసేపు కబుర్లు గ్రామఫోన్ సంగీతం, అయింతర్వాత వీధిగదిలో అమర్చబడ్డ, మంచం మీదికి నడుస్తాడు రంగనాథ్. పుష్ప వంటింట్లో వుంటుంది. జగన్నాథం కూతుర్ని, తన పడకగదిలోకి తీసికెళ్ళి, రహస్యంగా

మాట్లాడుతాడు. మొదట, తనకి రంగనాథ్ వ్యవహారం నచ్చలేదనే, అతనికీ ఆమెకీ యీడూ జోడూకాదనీ, ముఖ్యంగా, అతని వైఖరి పుష్పకికూడా నచ్చలేదనీ చెప్తాడు.

"నాన్నగారు! మీరు ఆవిడ మాటలు పట్టుగుని, అతన్ని అల్లా దూషించడం భావ్యంకాదు. ఒకవేళ, మీరు వర్ణించినట్టుగానే, రంగనాథ్ వెధవైనా, మీరింతగా ఆటంకపెట్టడంలో న్యాయంలేదు. మా యిరువురి మైత్రిని గురించి మీకు యిదివరకే ఉత్తరంలో రాశాను. ఆలోచించండి. పదిమందితోనూ తిరిగిన, వొక నీచకులంలో దానిమాట లట్టుగుని, మా పవిత్రప్రేమని నిందించడం..." మనోరమ, కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి.

"అది కాదు "మనూ" నీకు చిన్నతనం. పుష్ప పదిమందితో తిరిగినా, యిప్పటికైనా, జ్ఞానం సంపాదించి సరిగ్గా వుండగలిగింది. దాని హృదయం, యెంత సుందరమైనదో నువ్వెరగవు. మీ రంగనాథ్ విషయం దానికి తెలియకపోలేదు. అది నీమంచికోరే చెప్పింది సలహా – దాన్నల్లా అన్నానని తెలిస్తే అది ఆత్మహత్య చేసుకుంటుంది. అది పిల్లలు లేకపోయినా, తల్లిగా ప్రేమించగలిగిన వైరాగ్యం పొందింది..."

"చాల్లెండి నాన్నా! అన్నీ జరిగింతర్వాత, ఉపన్యాసాలంతా ఇస్తారు. అదిట్లా ఇతనిమీద నేరాలు చెప్పి, మమ్మల్ని విడగొట్టాలన్న ప్రయత్నంలో మీ నారోమైండెడ్‌నెస్, దాని నీచమైన యీర్ష్యాభావం కనిపిస్తున్నాయి. "శునకమును కనకపు సింహాసనమును" అన్న పద్యం మీకు జ్ఞాపకం ఉందా....నాకు బడలికగా వుంది. నే వెడతాను. ఇల్లాంటి యీవిల్ థాట్సు, బుర్రలో ప్రవేశపెట్టకండి..." అని హాలులో ఉయ్యాల మీద అమర్చబడ్డ పక్కమీద పరుండి దీపం తగ్గించింది.

* * * *

వంటిల్లు సర్దుకుని పుష్ప పడకగదిలోకి వొచ్చేటప్పటికి పదకొండు కొట్టింది. తలుపువేసి, దీపం తగ్గించి పక్కమీదికి చేరింది. ఇద్దరు అతి రహస్యంగా మాట్లాడారు.

"ఏమండీ, యేమంది?"

"చాలా చెప్పాను, లాభం లేకపోయింది. మనమేం చేస్తాం దాని కర్మ దాంది: నువ్వంతగా విచారించకు."

"కర్మ గిర్మ అనకండి. మనం కళ్ళారా చూస్తూ, మన "మనూ" పవిత్రతకి భంగం కలుగుతుంటే వూరుకుంటామా? ఆవెధవ మీరు నేను ప్రేమతో కట్టుగున్న యింట్లో, ఇల్లరికం వుంటోంటే చూసి నేను సహించగలనా? వాడితలంపే, నా మనస్సులో ఉప్పెన లేవదీసిందే. అట్లాంటిది, పండంటి "మను"ని నే సహించలేను... దానివల్ల మీకెంత బాధకలుగుతుందో నే ఊహించలేను. మన ప్రేమమధ్య వ్వాడి బింబంపడి మననీ ప్రేమనీ, లోకాన్నే అపవిత్రంగా చేస్తుంది... నే భరించలేను..." అని మెల్లగా యేడ్పు మొదలిడుతుంది. చేతనైనంతవరకు, పాపం జగన్నాథం ఓదారుస్తాడు. నిజానికి పుష్పకంటె, అతనికే యీ విషయం విషాదకరమైంది. కాని యిప్పుడతడు ప్రేమకీ, నీతికీ కూడా అతీతుడయ్యాడు. శరీరంలో జనించిన ప్రేమ విశ్వరూపం దాల్చింది. అల్లాగే ఆమెచేతిని తనగుండెల మీద

అదుముకుని విచారంలోంచి, అతను తన జీవిత దృష్టిని వెలుగులోకి నడిపించి, కండ్లు మూసి, నిద్రలోకి జారిపోయాడు.

* * * *

రాత్రి రెండు గంటలు దాటింది. పుష్ప లేచి మెల్లగా తన హస్తాన్ని అతని శరీరం మీదనుంచి తొలగించి, నుదురుమీద విషాదంతో వొణుకుతున్న తన అధరాలను కాసేపు ఆనించి, పాదాలకి నమస్కారంచేసి, టేబిల్ దగ్గరకెళ్ళి తొందరగా ఉత్తరంరాసి, వీధిగదిలోకి వెళ్ళింది, రంగనాథ్ లుంగీతో నిద్రపోతున్నాడు. దీపాన్ని కొంచెం పెద్దదిచేసి అతని బుజాలట్టుగుని గుంజింది. ఖంగారుపడి లేచాడు. దీపం పైకెత్తి చూసింది. అతను కొయ్యబారిపొయ్యాడు.

"జ్ఞాపకం వున్నానా, నేను... మళ్ళా యిక్కడ చేరావా? ఇప్పుడు మనోరమని మోసం చెయ్యడానికి సూటుబూటు వేసుకుని, మాకొంపతియ్యడానికి చక్కావొచ్చావా?" అంది పెదవులను కోపంతో ఆడిస్తూ.

"నోర్ముయ్యి తెగపేల్తున్నావు... నువ్వు రాలేదూ మళ్ళా జగన్నాథం కొంప తియ్యడానికి? అల్లాగే – నేను. నువ్వు పదికొంపలు తీస్తే నే వొకదానితోనే సంతుష్టి పడతాను.... ఇల్లా యెందుకొచ్చావ్ అర్థరాత్రి! పాతబాకీ యేమన్నావుందా... వుంటె, ముద్దుకి వొక రూపాయి చొప్పునిస్తాను" అని వెకిలిగా నవ్వుతాడు. పుష్ప కోపం పట్టలేక మొహంమ్మీద వుమ్మేస్తుంది. దానికి సమాధానంగా అతను ముద్దుకోసం మూతి వెతుకుతు పెనుగులాడతాడు. బైట పెద్ద గాలీ వాన వల్ల యీ గందరగోళం లోపలి వాళ్ళకి వినిపించడం లేదు. రెండు మూడు నిమిషాలు ఇద్దరు పెనుగులాడతారు. తన అధరాలని మాత్రం పుష్ప అతనికి అందనియ్యడం లేదు. ఆమెను సాధించడానికతను తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. వాళ్ళకాళ్ళు తగిలి దీపం కూడా క్రిందపడి పగిలింది. ఆఖరికి, పుష్ప, తన పళ్ళతో అతని బుగ్గని గట్టిగా పట్టుకుని కొరికింది. నాలుగైదు నిమిషాలు దాకాపట్టు విడవలేదు. రంగనాథ్ "అయ్యో, అయ్యో" అని కేకలుపెట్టాడు. హాల్లో లేచినట్లు చప్పుడైంది. పుష్ప పట్టు వొదిలి వీధిలోకి పరిగెత్తుకు పోయింది.

మనోరమ లేచి యేమిటో చూద్దామని గది ముందుకు వొచ్చి "నాథ్" అని పిలిచింది. "నాథ్" మూలుగుతున్నాడు. దీపం తీసుకొచ్చి అతనిముఖం మీదికి చూసింది. కుడిబుగ్గ ఎఱ్ఱగా లోతైన పెద్దగాట్లతో నిండివుంది. రక్తం ధార కింద కారిపోతోంది.

ఇంతలో జగన్నాథం కూడా లేచాడు. బల్లమీద ఉత్తరం కనిపించింది.

"నే యెన్నడూ మర్చిపోని దైవం జగన్నాథంగారికి పుష్ప కడసారి సందేశం.

"నేను జరిగిపోయిన చెడ్డ సంగుతులన్నీ మరిచిపోదామని చాలా ప్రయత్నించాను. కాని ఫలం లేకపోయింది. పాడుపురుషులు మరిచిపోదామన్నా మరుపురారు. నా స్వర్గంలోకి వొక సజీవుడైన పాపి ప్రవేశించాడు. ఆ స్వర్గాన్ని ఆ పాపికే వొదిలి నే శెలవు తీసుకున్నాను. ఇంతవరకూ జీవితం, నాకు పెద్దసమస్యగా తోచింది. కాని, నే మరణించిన తర్వాతైనా, నేను జీవితానికి పెద్ద సమస్యలా తోస్తానని నా ఆశయం. నా కెలాంటి విచారం లేదు.

జీవితంలో అనేక మృత్యువులు అనుభవించాను. వాటికి నే విచారించను. నిజంగా వాటిల్లో మరిచిపోదగ్గ ఘోరాలు యేమీ లేవు. ఏదో మంచిమార్గంలో పడదామని ప్రతి అల్ప ప్రాణీ ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. నాబోటి కొందరు గెలుస్తారు; కొందరు అధైర్యపడతారు. మీరూ యే బెంగా పెట్టుకోవద్దు. జీవితాన్ని అన్ని తప్పులతోనూ కష్టాలతోనూ ఉన్న పాళంగా అంగీకరించాలి. మనం యీ ఆనందమయ ప్రపంచంలో జన్మించినందుకే దైవానికి కృతజ్ఞులమై వుండాలి. వేటినీ దేన్నీ తృణీకరించి నిరసించకూడదు. అదేనా సందేశం. ప్రత్యేకంగా లోకానికి నాదో చిన్న సందేశం ఉంది. ఒక వ్యక్తిమానం, స్వచ్ఛత సౌందర్యం దుర్నీతిపాలు కాకుండా కాపాడగలిగాను.

నా అనుభవం వూరికే పోలేదు. ఒక్క వ్యక్తిని, కాపాడగలిగాను. నా స్త్రీ జాతికి చెందిన వొక స్త్రీకోసం, నే చేసిన త్యాగం అవినీతికరమైన అనుభవాల నుండి, జనించిందైనా లోకం ప్రేమింపదగిందే. ఆ వెధవ బ్రతికివున్నంతవరకూ నా త్యాగం, వాడి బుగ్గల మీదే అందరికీ కనిపిస్తుంది."

* * * *

రంగనాథ్ ఆ మర్నాడు కట్లు కట్టుకుని, ఆ వూళ్ళోంచి వెళ్ళిపోయాడు. సాయంకాలం "మను" తండ్రి దగ్గర కొచ్చింది.

"నాన్నా! నేను నిన్నన్నమాటలకి నన్ను క్షమించండి. పుష్ప హృదయం గొప్పది."

"దాని హృదయం కాదు; అది, నేను మరిచిపోయిన అనుభవాలు, దాని హృదయానికి గొప్పతనం కలిగించాయి" అన్నాడు జగన్నాథం.

అద్దంకట్టిన పుష్ప ఫోటోని, "మను" గోడమీద తగిల్చింది.

**భారతి - 1939, జూలై**